క్లుప్తంగా

సాగర్‌ నీరు విడుదల



నీటి విడుదలను పరిశీలిస్తున్న అధికారులు, నీటి సంఘాల నాయకులు

పెనుగంచిప్రోలు: చెరువుమాధవరం చెరువు నుంచి శుక్రవారం సరిహద్దులోని జగ్గయ్యపేట మండలంలోని గండ్రాయి వద్ద డీవీఆర్‌ బ్రాంచి కెనాల్‌కు నాగార్జున సాగర్‌ నీరు విడుదలయింది. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌పీ అధికారులు మాట్లాడుతూ 510 క్యూసెక్కుల నీరు కాలువకు వస్తున్నాయన్నారు. మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు నీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎన్‌ఎస్‌పీ ఈఈ శ్రీనివాసన్‌, డీఈ లక్ష్మీనారాయణ, నీటి సంఘం మాజీ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి వాసు, వైఎస్సార్‌సీపీ నాయకులు యలమంద రావు, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

జగ్గయ్యపేట అర్బన్‌: ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్‌జీఎస్‌ కళాశాలలో స్కిల్‌ హబ్‌ ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జ్‌ ప్రిన్సిపాల్‌ పీసీహెచ్‌.జానీ శుక్రవారం తెలిపారు. డొమెస్టిక్‌ డేటా ఎంట్రీ ఆపరేటర్‌ కోర్సుకు ఉచిత శిక్షణ ఇస్తామని, 3 నెలల పాటు శిక్షణ ఇచ్చి, అనంతరం స్థానికంగా ఉన్న పరిశ్రమలలో ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్‌ పి.నరేష్‌ మాట్లాడుతూ 30 ఏళ్ల లోపు వయస్సు కలిగిన ఇంటర్‌, డిప్లొమా, డిగ్రీ, ఆపైన విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు ఈనెల 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, జిల్లాలోని ఆసక్తి కలిగిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9014943757, 9182533657లో సంప్రదించాలని కోరారు.

రీ సర్వేతో కచ్చితమైన కొలతలు

- నందిగామ డెప్యూటీ ఇన్‌స్పెక్టర్‌ ఆఫ్‌ సర్వేయర్‌ రాజేంద్రప్రసాద్‌

కంచికచర్ల: జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా భూముల రీ సర్వేతో కచ్చితమైన కొలుతలు, హద్దుల వస్తాయని ఆ భూముల్లో ప్రభుత్వం పంపిణీ చేసిన హద్దు సర్వేరాళ్లను ఏర్పాటు చేస్తున్నామని, రైతులు సహకరించాలని నందిగామ డివిజన్‌ డెప్యూటీ ఇన్‌స్పెక్టర్‌ ఆఫ్‌ సర్వేయర్‌ రాజేంద్రప్రసాద్‌ అన్నారు. మండలంలోని పరిటాలలో ప్రభుత్వ, ప్రవేటు భూములను రీ సర్వే చేసి ప్రభుత్వం పంపిణీ చేసిన సరిహద్దు రాళ్లను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ భూముల్లో సర్వే రాళ్లను పాతుతున్న సమయంలో రైతులు పొలానికి భూ హక్కు పత్రంతో హాజరుకావాలని కోరారు. తమ రెవెన్యూ సిబ్బందిని నాలుగు బృందాలుగా విభజించామన్నారు. స్టోన్‌ ప్లాంటేషన్‌ ఈ నెల 15లోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులు, కౌలు రైతులు సహకరించాలన్నారు. డీటీ నాగుల్‌ మీరా, ఆర్‌ఐ శిరీష, వీఆర్వోలు శ్రీలక్ష్మీ, వేముల ప్రదక్షిణరావు, వేల్పుల జనార్ధన్‌, రైతులు పాల్గొన్నారు.

కాలనీలో పారిశుద్ధ్య పనులు

కంచికచర్ల: మండలంలోని గండేపల్లి గ్రామంలో పంచాయతీ సిబ్బంది డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించే కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచి బొక్కా రవికుమార్‌ మాట్లాడుతూ గ్రామంలో అన్ని వీధుల్లో కల్వర్టు నిర్మాణం చేపట్టామని డ్రెయినేజీల్లో మురుగునీరు పారుదల కోసం అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కాల్వల్లో బ్లీచింగ్‌, సున్నం చెల్లిస్తున్నామని, దోమలు వ్యాప్తి చెందకుండా ఎబేట్‌ను పిచకారి చేస్తున్నామన్నారు. తడి చెత్త, పొడి చెత్తలను వేరు వేరుగా రెండు ప్లాస్టిక్‌ డబ్బాల్లో వేసి క్లాప్‌ మిత్రలు తీసుకువచ్చే రిక్షాలో వేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్‌, కార్మికులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

వీరులపాడు: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవటంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీపీ కోటేరు లక్ష్మీ పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తుందన్నారు. చిన్నారులకు కూడా తల్లిదండ్రులు పోషకాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ నిప్పులపల్లి శాంతమ్మ, ఉప సర్పంచ్‌ బవిరిశెట్టి లక్ష్మీ, పీఏసీఎస్‌ ఆవుల ప్రసాద్‌, మాజీ చైర్మన్‌ కోటేరు సూర్యనారాయణ రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ధ్యానంపై అవగాహన

నందిగామ: మండలంలోని పెద్దవరం జిల్లా పరిషత్‌ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన పిరమిడ్‌ స్పిరిట్యువల్‌ మూమెంట్‌కి చెందిన ప్రతినిధులు విద్యార్థులకు ధ్యానం వలన కలిగే జ్ఞానం గురించి అవగాహన కల్పించారు. ధ్యానం ద్వారా విద్యార్థులకు తెలివితేటలు పెరగడం తోపాటు ఆలోచన శక్తి పెరుగుతుందని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి నిరంతర కృషి

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్‌
- తిరునాళ్ల మహోత్సవంలో ప్రత్యేక పూజలు



అమ్మవార్లకు పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్‌

నందిగామ టౌన్‌: అంకమ్మ, ముప్పాళ్లమ్మ అమ్మవార్ల ఆశీస్సులతో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్‌ మొండితోక జగన్‌మోహనరావు, శాసన మండలి సభ్యుడు డాక్టర్‌ మొండితోక అరుణకుమార్‌లు పేర్కొన్నారు. చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలో వేంచేసియున్న అంకమ్మ, ముప్పాళ్లమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. మహోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఉత్సవ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలుకగా ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించి ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు, అరుణకుమార్‌ మాట్లాడుతూ ఆనవాయితీగా వస్తున్న అమ్మవార్ల తిరునాళ్ల మహోత్సవాన్ని ప్రతి ఏటా వైభవంగా నిర్వహించటం ఆనందించదగ్గ విషయమన్నారు. ముఖ్యంగా గ్రామస్తులంతా కలిసి తిరునాళ్ల మహోత్సవాన్ని నిర్వహించుకోవటం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లాని సాయి, అయ్యన్న, కపిల్‌, వైఎస్‌ఎన్‌ ప్రసాద్‌, కందుల నాగేశ్వరరావు, వెలగపూడి వెంకటేశ్వరరావు, పలువురు నాయకులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కమనీయం తిరుపతమ్మ దివ్య ప్రభోత్సవం



ప్రభోవత్సవానికి తీసుకు వస్తున్న శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మవార్ల ఉత్సవమూర్తులు



ఆలయం చుట్టూ తిరుగుతున్న దివ్య ప్రభ

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ అమ్మవారి తిరునాళ్లలో నాల్గవ రోజు శుక్రవారం రాత్రి 90 అడుగుల దివ్య ప్రభోత్సవం కమనీయంగా జరిగింది. దక్షిణ భారతదేశంలో అత్యంత ఎత్తైన ప్రభగా గుర్తింపు పొందిన ఈదివ్య ప్రభోత్సవం 1928వ సంవత్సరం నుంచి జరుగుతున్నట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ముందుగా అమ్మవారికి రజకులు, శాలివాహనులు కుంభం పోసి ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం ఆలయ ఈఓ జీవీడీఎన్‌ లీలాకుమార్‌, చైర్మన్‌ ఇంజం చెన్నకేశవరావు, ఆలయ ఈఈ వైకుంఠరావు ఆధ్వర్యంలో రంగు రంగుల విద్యుత్‌ దీపాలంకరణతో అలంకరించిన ఇనుప ప్రభపై ఉత్సవ విగ్రహాలను ఉంచి దేవస్థానం వారు గ్రామానికి చెందిన రైతుల ఎడ్లను కట్టి రథాన్ని గుడి చుట్టూ ప్రదక్షణ చేయించారు. ప్రభ ముందు డప్పు వాయిద్యాలు, కొమ్ము వాయిద్యాలు, నృత్యాలు భక్తులను విశేషంగా ఆకర్షించాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నందిగామ ఏసీపీ జి.నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జగ్గయ్యపేట సీఐ నాగమురళి పర్యవేక్షణలో ఎస్‌ఐ హరిప్రసాద్‌ పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌ లక్ష్మీకల్యాణి, ఏఈఓలు ఉమాపతి, కొండలరావు, తిరుమలేశ్వరరావు, ఆలయ పాలకవర్గ సభ్యులు కోలా రామారావు, కట్టా మాధవి, ఆదిమూలం నరసింహారావు, గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పరిశ్రమను సందర్శించిన ఫార్మసీ విద్యార్థులు



బెంగళూరులోని ఔషధ పరిశ్రమ వద్ద విజయ ఫార్మసీ విద్యార్థినులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్‌ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో నడుస్తున్న విజయ మహిళ ఫార్మసీ కళాశాల విద్యార్థినులు కర్ణాటకలోని బెంగుళూరు ప్రాంతంలో ఉన్న అంతర్జాతీయ స్థాయి ఔషధ పరిశ్రమలను సందర్శించారు. మైక్రో ల్యాబ్స్‌ లిమిటెడ్‌, కర్ణాటక యాంటీబయాటిక్‌ లిమిటెడ్‌, రెమెడిక్స్‌ ఫార్మా ఔషధ సంస్థలను బీ ఫార్మసీ మూడు, నాలుగో సంవత్సరాలకు చెందిన 90 మంది విద్యార్థినులు సందర్శించి పలు విషయాలను తెలుసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్‌ కె. పద్మలత మాట్లాడుతూ త్వరలో ఫార్మసీ రంగంలో అడుగుపెట్టనున్న విద్యార్థినులకు ఈ సందర్శన ఎంతో ముఖ్య మైనదన్నారు. ఇప్పటి నుంచే విద్యార్థినులు కొత్త కొత్త ఔషధాలు తయారు చేసేలా తమ ఆలోచనలకు పదును పెట్టాలన్నారు.

‘యుద్ధనారి’ పుస్తకావిష్కరణ



‘యుద్ధనారి’ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యులు ప్రశాంతి, రచయితలు

కంచికచర్ల: సమాజంలో మహిళలపై అత్యాచారాలు,అన్యాయాలు, అరాచకాలు, దౌర్జన్యాలు, హత్యలు, చూసి చలించిపోయి ‘యుద్ధనారి’ సంకలనం పుస్తకాన్ని ప్రముఖ రచయిత నీలం సర్వేశ్వరరావు సమాజానికి అందించటం అభినందనీయమని జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, సర్పంచి వేల్పుల సునీత పేర్కొన్నారు. మండల పరిషత్‌ కార్యాలయంలో శుక్రవారం ‘యుద్ధనారి’ పుస్తకాన్ని ఆవిష్కరించారు. సావిత్రీ బాయి పూలే వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.ముఖ్య అతిథులు ప్రముఖ కవిఅసరవల్లి కృష్ణ, ప్రముఖ కవయిత్రి సాహిత్య విమర్శకురాలు శైలజామిత్ర ఉన్నా రు.ప్రముఖ కవి సరికొండ నరసింహారావు మా ట్లాడుతూ దేశంలో మహిళలపై రోజు రోజుకు జరుగుతున్న అత్యాచారాలు, అన్యాయాలపై నిరసన గళాలే ‘యుద్ధనారి’ పుస్తకం అన్నారు. బహుజన రచయితల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తంగిరాల సోనీమాట్లాడుతూ ‘యుద్ధనారి’ కవి తా సంపుటి ప్రతి ఒక్క తల్లిదండ్రులు వారి పిల్లలతోచదివించాలని, స్త్రీలు, సమాజంపై మానవీయ విలువలతో బాధ్యత ఉండేలా చూడాలన్నారు. అనంతరం ‘యుద్ధనారి’ పుస్తకాన్ని పలువురికి అందజేశారు. వైఎస్సార్‌ సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు,వేల్పులశ్రీనివాసరావు,వేల్పుల రమేష్‌ కవులు,రచయితలు మహిళలు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై ముగిసిన శిక్షణ



గుంటుపల్లి రైల్వే వ్యాగన్‌ వర్క్‌షాపులో మాక్‌ డ్రిల్‌ నిర్వహిస్తున్న సిబ్బంది

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లి రైల్వే వ్యాగన్‌ వర్క్‌షాపులో వారం రోజులుగా జరిగిన ప్రమాదాల నివారణ శిక్షణ సదస్సు శుక్రవారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా చీఫ్‌ వర్క్‌ మేనేజర్‌ కె.శ్రీనివాస్‌ పాల్గొన్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్‌ సిబ్బంది రోజువారీ పనుల్లో జరిగే ప్రమాదాల నివారణపై కార్మికులకు శిక్షణ ఇచ్చారు. ముగింపు సందర్భంగా ప్రమాదాల సమయంలో చేపట్టాల్సిన తక్షణ చర్యలపై మాక్‌డ్రిల్‌ నిర్వహించారు. గ్యాస్‌ లీకైతే తీసుకోవాల్సి జగ్రత్తలు, వ్యక్తులు గాయపడితే ఎటువంటి చర్యలు చేపట్టాలి. అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడే పద్ధతులు, సీపీఆర్‌ చేసే పద్ధతిని మాక్‌డ్రిల్‌ ద్వారా వివరించారు. డెప్యూటీ సీఎంఈ రవీంద్ర, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి



ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్‌లో మాట్లాడుతున్న పరిశ్రమల ఉప తనిఖీ అధికారి శ్రీనివాస్‌ తదితరులు

ఇబ్రహీంపట్నం: పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించి, ప్రమాదాలు నివారించాలని కర్మాగారాల ఉప తనిఖీ అధికారి కె.శ్రీనివాస్‌ తెలిపారు. 45వ జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా స్థానిక ఎన్టీటీపీఎస్‌లో ప్రమాదాల నివారణపై కార్మికులు, ఉద్యోగులకు అవగాహన సదస్సు శుక్రవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ మానవ తప్పిదాలతోనే ప్రమాదాలు జరుగుతాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో ప్రమాదాల నివారణ జీరో స్థాయికి తీసుకురావాలని చెప్పారు. ఈసందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. చీఫ్‌ ఇంజినీర్‌ అశోక్‌కుమార్‌రెడ్డి, అధికారులు టి.రాజు, యు.శ్రీనివాసరావు, నాగబాబు, ఎస్‌ఈలు పాల్గొన్నారు.

బీసీ విభాగం బలోపేతానికి కృషి



ఇబ్రహీంపట్నం: తిరువూరు నియోజకవర్గం ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణ నిధిని వైఎస్సార్‌ సీపీ ఎన్టీఆర్‌ జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు నిడుముక్కల శివశంకరరావు తిరువూరు పార్టీ కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే రక్షణనిధిని సత్కరించారు. జిల్లాలో బీసీ విభాగం బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. తనపై నమ్మకంతో జిల్లా బీసీ సెల్‌ అధ్యక్షుడిగా నియమించిన సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రక్షణనిధి, వసంత కృష్ణప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకుడు గోవర్ధనరావు పాల్గొన్నారు.

ఉగాదికి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ఉగాది నాటికి పూర్తయ్యేలా సచివాలయ ఇంజినీరింగ్‌ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలని మున్సిపల్‌ కమిషనర్‌ సీహెచ్‌ వెంకటేశ్వర్లు ఆదేశించారు. మున్సిపల్‌ కార్యాలయంలో 10 సచివాలయ ఇంజినీరింగ్‌ అసిస్టెంట్లతో ఇళ్ల నిర్మాణాలపై శుక్రవారం సమీక్షించారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న రీసర్వే పనుల పురోగతిపై సచివాలయ సర్వేయర్లకు అవగాహన కల్పించారు.

14న నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

తిరువూరు: ఈ నెల 14వ తేదీన జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. విద్యార్థులు నులిపురుగుల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను అర్బన్‌ ప్రైమరీ హెల్త్‌ సెంటర్‌ వైద్యాధికారి డాక్టర్‌ కృపారాణి వివరించారు. భోజనానికి ముందు, తర్వాత విద్యార్థులు సబ్బుతో చేతులు కడుక్కోవాలని, బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేయరాదని, మరుగుదొడ్లకు వెళ్లినపుడు కూడా చేతులు శుభ్రపరచుకోవాలని తెలిపారు. ఈ నెల 14న విద్యార్థులకు డీవార్మింగ్‌ మందు పంపిణీ చేయాలన్నారు. నగర పంచాయతీ కమిషనర్‌ బాలకృష్ణ, ఆరోగ్య సిబ్బంది, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

తోటమూల(గంపలగూడెం): పెద్దకొమిర కేజీబీవీలో పదో తరగతి విద్యార్థులకు అవసరమైన పరీక్ష సామగ్రిని శుక్రవారం దాతల సహకారంతో అందజేశారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో దాతలు అల్లు గణపతిరెడ్డి, గొరసాని భాస్కర్‌రెడ్డి 70 మంది విద్యార్థులకు జామెంట్రీ బాక్స్‌, పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. సమ్మెటివ్‌-1 పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఎం.కీర్తన, జి.ప్రేమ్‌కుమారీలను సన్మానించారు. పాఠశాలలోని 250 మంది విద్యార్థులకు మిఠాయిలు అందించారు. ప్రత్యేక అధికారి ఎం.వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాల మంజూరు



తిరువూరు: మండలంలోని 4 గ్రామాల్లో జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పత్రాలు మంజూరైనట్లు తిరువూరు రెవెన్యూ డివిజనల్‌ అధికారి ప్రసన్నలక్ష్మి తెలిపారు. మండలంలో శుక్రవారం రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో ఈకేవైసీ పరిశీలనలో భాగంగా ఆర్డీఓ రైతులకు రీ సర్వే ప్రయోజనాలను వివరించారు. ముష్టికుంట్ల, చిట్టేల, వామకుంట్ల, అంజనేయపురం గ్రామాల్లో 1,946 మంది రైతులకు వచ్చిన భూ హక్కు పత్రాల పంపిణీ జరుగుతోందని, భూ రక్ష కింద పొలాల సరిహద్దు రాళ్లు అందజేస్తున్నామని ఆర్డీఓ తెలిపారు. రైతులు సహకరించి ప్లాంటేషన్‌ పూర్తి చేసుకోవాలన్నారు. తహసీల్దార్‌ సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళావిద్యకు సావిత్రీబాయి పూలే కృషి

వర్ధంతి కార్యక్రమాల్లో వక్తలు



సావిత్రీబాయి పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌ సీపీ నేత వెంకటకృష్ణ ప్రసాద్‌, కౌన్సిలర్లు



సావిత్రీబాయి పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నేతలు

జగ్గయ్యపేట అర్బన్‌: సావిత్రీబాయి పూలే వర్ధంతిని శుక్రవారం పలు పార్టీ, సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ రోడ్‌లోని సావిత్రీబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా మహిళా విద్యకు ఆమె చేసిన కృషిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ యువనాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్‌, పలువురు పార్టీ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సావిత్రీ బాయి పూలే ఆడపిల్లల చదువు కోసం నిరంతరం పాటుపడిన చైతన్యమూర్తి అన్నారు. మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా అనేక మహిళా విద్యా సంస్థలను స్థాపించి బాలికా విద్యను స్వయంగా ప్రోత్సహించారన్నారు. సమాజంలో రుగ్మతలు రూపుమాపడానికి విశేష కృషిచేసిన సామాజిక ఉద్యమ కారిణి అని కొనియాడారు. మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ తుమ్మల ప్రభాకర్‌, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్‌, వాణిజ్య విభాగం అధ్యక్షుడు చారుగుండ్ల కొండ, కౌన్సిలర్‌ వట్టెం మనోహర్‌, కోఆప్షన్‌ సభ్యుడు ఖాదర్‌బాబు, నాయకులు ఫిరోజ్‌ఖాన్‌, తన్నీరు నాగేంద్ర, దువ్వల రామకృష్ణ, దాది బ్రహ్మం, చిరంజీవి, శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు బాలసైదా, బీసీ సెల్‌ నేతలు దేవరకొండ శ్రీను, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

పట్టణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రీ బాయి పూలే వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ రోడ్‌లోని సావిత్రీబాయి పూలే విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ తూమాటి కృష్ణ, సంఘ నాయకులు ఉద్దంటి వాసు, దేవరకొండ శ్రీను, పచ్చిపాల నాగేశ్వరరావు, రాజా రామకృష్ణవర్మ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళల అక్షరాస్యత కోసం నిరంతరం శ్రమించిన మహనీయురాలని ఆమె సేవలను కొనియాడారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

కమిషనర్‌ డాక్టర్‌ జయరామ్‌



16వ వార్డులో డ్రెయినేజీలో తాగునీటి పంపును పరిశీలిస్తున్న కమిషనర్‌ జయరాం

నందిగామ: వేసవికాలంలో కూడా తాగు, వాడుక నీటికి ఇబ్బంది లేకుండా ఉండేలా అవసరమైన అన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్‌ డాక్టర్‌ జయరామ్‌ పేర్కొన్నారు. పట్టణంలోని 16వ వార్డు పరిధిలో శుక్రవారం ఆయన పర్యటించారు. వార్డులోని బోరు పంపులను, తాగునీటి కుళాయిలను పరిశీలించారు. పలుచోట్ల డ్రెయినేజీలలో ఉన్న తాగునీటి కుళాయిలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణవాసులకు వేసవికాలంలో కూడా తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉండేలా అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణంలోని ప్రతి వార్డులో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌ నిర్వహిస్తున్నామన్నారు. పారిశుద్ధ్యం మెరుగుకు పట్టణవాసులు సహకరించాలన్నారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో గల బోరు పంపులను మరమ్మత్తులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై అవగాహన ఉండాలి



కంచికచర్ల మిక్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న కృష్ణ

కంచికచర్ల: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు నూతన ఆవిష్కరణపై అవగాహన కలిగి ఉంటేనే ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని ప్రొఫెసర్‌ ఎస్‌.కృష్ణ అన్నారు. కంచికచర్ల మిక్‌ కాలేజ్‌ ఆఫ్‌ టెక్నాలజీలో జాతీయ స్థాయి టెక్నికల్‌ సింపోజియం ‘ఆగమ 2023’ శుక్రవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కే శ్రీనివాస్‌ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం పలు ఇంజినీరింగ్‌ కళాశాలల నుంచి 500 మంది విద్యార్థులు పేపర్‌ ప్రజెంటేషన్‌, పోస్టర్‌ మేకింగ్‌, క్విజ్‌, కోడింగ్‌ పలు పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, ట్రోఫీ, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సీఈఓ డి.పాండురంగారావు, మేనేజ్‌మెంట్‌ మెంబర్‌ ఎం సుహాస్‌, ఆగమ కో ఆర్డినేటర్‌ డాక్టర్‌ సాయి చైతన్యకుమార్‌, డాక్టర్‌ ప్రదీప్‌ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్‌ షాపు సీజ్‌



షాపును సీజ్‌ చేసి తాళం వేస్తున్న ఆర్‌ఐ ఆనంద్‌, సిబ్బంది

జగ్గయ్యపేట అర్బన్‌: పట్టణంలో శుక్రవారం రెవెన్యూ అధికారులు పలు రేషన్‌ షాపులను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో షాపు నంబర్‌ 0685016లో 57 కిలోల అంగన్‌వాడీ బియ్యం, 33 కిలోలు ప్రజలకు సరఫరా చేసే బియ్యం కలిపి మొత్తం 90 కిలోల బియ్యం ఉండాల్సిన స్టాకు కంటే ఎక్కువ ఉన్నాయి. దీంతో సదరు రేషన్‌ షాపు డీలర్‌ పేరం వెంకటేశ్వర్లుపై 6ఏ కేసు నమోదు చేసినట్లు ఆర్‌ఐ యు.ఆనంద్‌ తెలిపారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సేవలు అభినందనీయం

జడ్జి షేక్‌ షీరెన్‌

మైలవరం: గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీల సేవలు అభినందనీయమని మైలవరం జూనియర్‌ సివిల్‌ జడ్జి కోర్టు జడ్జి షేక్‌ షీరెన్‌ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో భాగంగా మైలవరం ఐసీడీఎస్‌ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో జడ్జి షేక్‌ షీరెన్‌ మాట్లాడుతూ.. గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతయుతంగా సేవలు అందిస్తున్నారన్నారు. మైనర్లకు వివాహాలు జరగకుండా నిరోధించేందుకు కృషి చేయాలని సూచించారు. మైలవరం ఐసీడీఎస్‌లో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీఓ పుష్పలత, మైలవరం బార్‌ అసోసియేషన్‌ మాజీ అధ్యక్షుడు బుద్దారపు వెంకట్రావు, మైలవరం బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు ఎం.రవికుమార్‌,అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో మహిళ పాత్ర కీలకం

భవానీపురం(విజయవాడపశ్చిమ): పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుంటున్న మహిళలదే సమాజ నిర్మాణంలో కీలక పాత్ర అని విజయవాడ రూరల్‌ ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని జక్కంపూడి వైఎస్సార్‌ కాలనీలో శుక్రవారం మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినులు సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమారి మాట్లాడుతూ చదువుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లి ఏదైనా సాధించగలరని పేర్కొన్నారు. అటువంటి చదువు నేర్పే ఉపాధ్యాయినులు తనను సత్కరించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. చిన్నారులకు విద్య బోధిస్తూనే కుటుంబ బాధ్యతలు నెరవేరుస్తున్న ఉపాధ్యాయినులు అభినందనీయులన్నారు.